సాక్షి ఆదిలాబాద్

సోమవారం । 26 । ఫిబ్రవరి । 2024

సల్లంగ సూడమ్మా..

మంచిర్యాల జిల్లా గాంధారి ఖిల్లా వద్ద మూడు రోజులుగా నిర్వహిస్తున్న గాంధారి మైసమ్మ జాతర ఆదివారంతో ముగిసింది. మైసమ్మ తల్లిని దర్శించుకునేందుకు ఆదివాసీ నాయక్‌పోడ్‌లు వేలాదిగా తరలివచ్చారు.

- వివరాలు 8లో▸



గరిష్టం/కనిష్టం
32.0/23.0

వాతావరణం

ఆకాశం చాలా వరకు మేఘావృతమై ఉంటుంది. పలుచోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమశాతం పెరగనుంది.

న్యూస్‌రీల్

రిమ్స్‌లో కొనసాగుతున్న కార్మికుల నిరసన



నినాదాలు చేస్తున్న కార్మికులు

ఆదిలాబాద్‌టౌన్: అగ్రిమెంట్ ప్రకారం వేతనాలు, పీఎఫ్, ఈఎస్ఐ చెల్లించాలని డిమాండ్ చేస్తూ రిమ్స్ కార్మికులు చేపడుతున్న నిరసన కార్యక్రమం కొనసాగుతోంది. ఇందులో భాగంగా ఆదివారం సైతం ఆస్పత్రి ఆవరణలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి సిర్ర దేవేందర్ మాట్లాడారు. రిమ్స్, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు, సెక్యూరిటీ గార్డులు, పేషెంట్‌కేర్‌లకు జీఓ నం.60 ప్రకారం వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. లేకుంటే మార్చి 7నుంచి నిరవధిక సమ్మె చేపడతామని హెచ్చరించారు. ఇందులో రిమ్స్ బ్రాంచి ప్రధాన కార్యదర్శి ఎండీ ఖాసీం, అధ్యక్షురాలు ఎ. సంగీత, కార్మికులు పాల్గొన్నారు.

ఉమ్మడి శాస్త్ర విద్యా విధానం అమలు చేయాలి


ఆదిలాబాద్‌టౌన్: జాతీయ విద్యావిధానం ఎన్ఈపీ– 2020ను రద్దు చేసి ఉమ్మడి శాస్త్ర విద్యా విధానం అమలు చేయాలని విద్యార్థి సంఘాల జేఏసీ జిల్లా కన్వీనర్ బి.రాహుల్ అన్నారు. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివారం నిర్వహించిన అఖిల భారత విద్యార్థుల సదస్సులో పాల్గొని మాట్లాడారు. విశ్వ విద్యాలయాల్లో ఉన్న బోధన, బోధనేతర పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలో గిరిజన విశ్వ విద్యాలయం ఏర్పాటుకు సహకరించాలని కోరారు. సదస్సులో విద్యార్థి సంఘాల నాయకులు అనసూయ, మమత, నవీన్ కుమార్, సుజయ్, సత్యనారాయణ, సాయికుమార్, ఇఫ్తార్‌ఖాన్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా 'ప్రతిభ' ప్రవేశపరీక్ష

ఆదిలాబాద్‌రూరల్: సాంఘిక సంక్షేమ గురుకుల ప్రతిభ కళాశాలల రెండో విడత ప్రవేశ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. సాంఘిక సంక్షేమ గురుకుల ప్రతిభ కళాశాల ఆదిలాబాద్ జిల్లా సమన్వయ కర్త, ప్రిన్సిపాల్ శ్రీనివాస్ కేంద్రాన్ని పరిశీలించారు. ఆయనతో పాటు స్పెషల్ అబ్జర్వర్ బోథ్ కళాశాల ప్రిన్సిపాల్ సువర్ణలత సైతం పరీక్ష కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రెండో విడత ప్రవేశ పరీక్షకు 173 మంది బాలురు, 145 మంది బాలికలు హాజరైనట్లు తెలిపారు.

మెగా డీఎస్సీకి కసరత్తు

- డీఈవోలతో రాష్ట్ర విద్యాశాఖ సమావేశం
- గత నోటిఫికేషన్‌కు అనుబంధంగా ప్రకటించే అవకాశం?
- జిల్లాలో తాజాగా 323 పోస్టుల గుర్తింపు
- నిరుద్యోగుల్లో చిగురిస్తున్న ఆశలు



జిల్లాలో..

గతేడాది ఇచ్చిన నోటిఫికేషన్‌లో ప్రకటించిన పోస్టులు: 275

తాజాగా గుర్తించిన పోస్టుల సంఖ్య:323

పెరగనున్న పోస్టులు :48

విభాగాల వారీగా ఖాళీల వివరాలు..

స్కూల్ అసిస్టెంట్ : 81

భాషాపండిత్ : 14

పీఈటీ : 02

ఎస్జీటీలు : 226

323 ఖాళీల గుర్తింపు..

జిల్లాలో ఉపాధ్యాయ ఖాళీల వివరాలను విద్యాశాఖాధికారులు సేకరించారు. ఫిబ్రవరి 20 వరకు ఖాళీగా ఉన్న వివరాలన్నింటిని ప్రభుత్వానికి అందజేశారు. జిల్లా వ్యాప్తంగా 323 ఖాళీలు ఉన్నట్లు గుర్తించారు. గత ప్రభుత్వం ఎన్నికల ముందు నోటిఫికేషన్ విడుదల చేయగా అప్పట్లో 275 పోస్టులు భర్తీ చేసేందుకు సిద్ధమయ్యారు. ఆ తర్వాత ఎన్నికల కోడ్ రావడంతో ఆ ప్రక్రియ నిలిచిపోయింది. ఫిబ్రవరిలో డీఎస్సీ నిర్వహించాల్సి ఉండగా, కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మరిన్ని ఖాళీలను భర్తీ చేసేందుకు సిద్ధమైంది. మెగా డీఎస్సీ ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా 11వేల పోస్టులను భర్తీ చేయనున్నట్లు అధికారులు చెబుతున్నారు. అప్పటి నోటిఫికేషన్ కంటే రాష్ట్రవ్యాప్తంగా 5,086 పోస్టులు అధికంగా ఉండనున్నాయి. అలాగే జిల్లాలో 48 పోస్టులు పెరగనున్నాయి. అయితే గత డీఎస్సీ కోసం జిల్లాలో 10వేల మంది వరకు అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా, అదనంగా మరో 2వేల మంది వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

ఆదిలాబాద్‌టౌన్: ఉపాధ్యాయ పోస్టుల భర్తీ దిశగా రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలో భాగంగా కాంగ్రెస్ సర్కారు మెగా డీఎస్సీకి సిద్ధమవుతోంది. గత ప్రభుత్వం డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసి దరఖాస్తులను స్వీకరించిన విషయం తెలిసిందే. అప్పట్లో ఎన్నికల కోడ్ కారణంగా ఆ ప్రక్రియ నిలిచిపోయింది. అయితే గత నోటిఫికేషన్‌కు అనుబంధంగా పోస్టులు పెంచి భర్తీ చేసేలా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతున్నట్లు తెలుస్తోంది. గతంలో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఫీజు చెల్లించే అవకాశం లేకపోయినప్పటికీ మరోసారి దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పించనున్నట్లు తెలుస్తోంది. కాగా తక్కువ పోస్టులు ఉండడంతో చాలామంది దరఖాస్తుకు ముందుకు రాలేదు. ప్రస్తుతం వారికి సైతం అవకాశం కల్పించనున్నట్లు సమాచారం. అయితే గతంలో ప్రకటించిన డీఎస్సీ ప్రక్రియను పూర్తిగా రద్దు చేస్తారా.. లేక అనుబంధంగా పోస్టులను పెంచి నిర్వహిస్తారా అనేది నోటిఫికేషన్ విడుదలతో తేటతెల్లం కానుంది.

విద్యాశాఖ సమావేశం..

ఆయా జిల్లాల విద్యాశాఖ అధికారులతో శనివారం హైదరాబాద్‌లో ఆ శాఖ ఉన్నతాధికారులు సమావేశం నిర్వహించారు. జిల్లాల వారీగా ఖాళీగా ఉన్న పోస్టుల వివరాలను సేకరించారు. వాటిని భర్తీ చేసేలా నోటిఫికేషన్ జారీకి కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా జిల్లా స్థాయిలోనూ రోస్టర్, కేటగిరీ వారీగా పోస్టులతో కూడిన నివేదికను సిద్ధం చేస్తున్నారు. ఈనెలాఖరు, మార్చి మొదటి వారంలో నోటిఫికేషన్ రానుందనే సమాచారంతో విద్యాశాఖ సమాయత్తమవుతోంది. తాజా నిర్ణయంతో ఆ పోస్టుల కోసం ఏళ్లుగా ఎదురుచూస్తున్న నిరుద్యోగుల్లో హర్షం వ్యక్తమవుతుంది. కాగా, గత ప్రభుత్వం జిల్లాలో డీఎస్సీ ద్వారా 275 పోస్టులను భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ విడుదల చేసిన విషయం తెలిసిందే. ఇందులో 54 స్కూల్ అసిస్టెంట్ పోస్టులు, 206 ఎస్జీటీ, 13 భాషా పండిత్, 2 పీఈటీ పోస్టులు ఉన్నాయి.

నిరుద్యోగుల్లో ఆనందం..

కొత్త సర్కార్ మెగా డీఎస్సీకి సిద్ధమవుతుండడంతో నిరుద్యోగుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ఇప్పటికే స్టాఫ్ నర్సులు, పోలీసు కానిస్టేబుళ్ల పోస్టులను భర్తీ చేసిన విషయం తెలిసిందే. తాజాగా డీఎస్సీ నోటిఫికేషన్ ప్రకటించనుండడంతో మళ్లీ పుస్తకాలతో కుస్తీకి సిద్ధమవుతున్నారు. 2017 తర్వాత ఉపాధ్యాయ నియామకాలు జరగలేదు. దీంతో బీఎడ్, డీఎడ్ పూర్తి చేసిన వారిలో నిరుత్సాహం వ్యక్తమవుతోంది. ఏళ్లుగా పోస్టులు భర్తీ కాకపోవడంతో విద్యా వ్యవస్థ కుంటుపడుతోంది. ఉపాధ్యాయుల సర్దుబాటులో ఏ పాఠశాలకు కూడా పూర్తి స్థాయిలో టీచర్లు లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. మెగా డీఎస్సీ ద్వారా పోస్టులు భర్తీ చేస్తే వచ్చే విద్యా సంవత్సరంలో కొత్త పంతుళ్లు విద్యార్థులకు పాఠాలు బోధించే అవకాశం ఉంది. నోటిఫికేషన్ వెలువరించిన రెండు నెలల తర్వాత పరీక్ష నిర్వహించి, ఆ తర్వాత భర్తీ ప్రక్రియ చేపట్టే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఇదివరకే ఉపాధ్యాయుల బదిలీ, పదోన్నతుల ప్రక్రియ జరిగింది. అయితే స్కూల్ అసిస్టెంట్లకు ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతి చేపట్టగా, ఎస్జీటీలకు స్కూల్ అసిస్టెంట్ల ప్రక్రియ నిలిచిపోయింది. అయితే కొంత మంది టెట్ అర్హత ఉన్న ఉపాధ్యాయులకే పదోన్నతులు కల్పించాలని కోర్టును ఆశ్రయించారు. దీంతో కోర్టు టెట్ ఉన్నవారికే పదోన్నతులు కల్పించాలని స్పష్టం చేసింది. ఈ విషయంలో విద్యాశాఖ ఎటూ తేల్చక పోవడంతో ఆ ప్రక్రియ ముందుకు సాగడం లేదు. ఒకవేళ ఆ ప్రక్రియ జరిగి ఉంటే దాదాపు వంద వరకు స్కూల్ అసిస్టెంట్, ఎస్జీటీ పోస్టులు పెరిగే అవకాశం ఉండేది.

ఖాళీలను గుర్తించాం..



మెగా డీఎస్సీకి సంబంధించిన సమావేశం హైదరాబాద్‌లో ఉన్నతాధికారులతో శనివారం జరిగింది. జిల్లాలో ఖాళీగా ఉన్న పోస్టుల వివరాలు అందజేయాలని ఆదేశించారు. వారి ఆదేశాల మేరకు ఖాళీల వివరాలను గుర్తించాం. త్వరలోనే పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్, కార్యదర్శికి పూర్తి వివరాలు సమర్పిస్తాం.

– ప్రణీత, డీఈవో

రైల్వే బ్రిడ్జీలకు నిధులొచ్చేదెప్పుడో..?

- పిల్లర్లకే పరిమితమైన ఆర్‌వోబీ
- పనులే ప్రారంభంకాని ఆర్‌యూబీ
- భూసేకరణ నిధుల విడుదలలో తీవ్ర జాప్యం

ఆర్‌యూబీ, ఆర్‌వోబీలకు మంజూరైన నిధులు: రూ.97.20 కోట్లు
కేంద్ర ప్రభుత్వ వాటా : రూ.39.40 కోట్లు
రాష్ట్ర ప్రభుత్వ వాటా : రూ.57.71 కోట్లు



ఆర్‌వోబీ కోసం ఓ వైపు నిర్మించిన పిల్లర్లు

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పట్టణంలో చేపట్టాల్సిన రైల్వే అండర్ బ్రిడ్జి (ఆర్‌యూబీ) రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్‌వోబీ) నిర్మాణాలు ఇప్పట్లో జరిగేలా కనిపించడం లేదు. రెండేళ్ల క్రితం వీటి నిర్మాణాల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో నిధుల మంజూరైనా ఇప్పటి దాకా నయాపైసా విడుదల కాకపోవడం గమనార్హం. అసెంబ్లీ ఎన్నికల సమయంలో గతేడాది రైల్వే ఓవర్ బ్రిడ్జి పిల్లర్ల పనులు ప్రారంభించగా అవి సగానికే పరిమితమయ్యాయి. ఆర్‌యూబీ పనులైతే ఇప్పటికీ మొదలు కాలేదు. రెండుచోట్ల భూసేకరణకు సంబంధించిన నిధులు విడుదల కాకపోవడంతోనే వాటి నిర్మాణాల్లో జాప్యం అవుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతుంది. ఆ నిధులు విడుదలైతే తప్ప పనులు ముందుకు సాగని పరిస్థితి.

ఓ వైపే ఆర్‌వోబీ పిల్లర్ల నిర్మాణం

మున్సిపల్, రెవెన్యూ, రైల్వే విభాగాలు సంయుక్తంగా సర్వే చేపట్టి అందించిన నివేదికల ఆధారంగా ఆర్‌యూబీ, ఆర్‌వోబీ నిర్మాణాలకు రూ.97.20 కోట్ల నిధులు మంజూరయ్యాయి. దీంతో గతేడాది అసెంబ్లీ ఎన్నికలకు ముందు మే 4న ఎంపీ సోయం బాపూరావు, మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న, ప్రస్తుత ఎమ్మెల్యే పాయల్ శంకర్ భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. దీంతో ఇక తమ కష్టాలు తీరుతాయని పట్టణంతో పాటు రైల్వే ట్రాక్‌కు అవతలి నుంచి వచ్చే గ్రామీణ, మహారాష్ట్రకు చెందిన ప్రజలు ఆశపడ్డారు. కానీ వీటి నిర్మాణ పనులు ముందుకు సాగడం లేదు. సంజయ్‌నగర్ సమీపంలో ఆర్‌వోబీ కోసం 932 మీటర్ల వరకు ఆర్అండ్‌బీ శాఖ, రైల్వే పట్టాలపై 38.28 మీటర్ల పొడవు రైల్వే శాఖ పనులను చేపట్టాల్సి ఉంది. మార్కెట్ యార్డు సమీపం నుంచి ఆర్టీవో కార్యాలయం వరకు గల ప్రభుత్వ స్థలంలో ఆర్‌వోబీకి సంబంధించి ఓ వైపు మాత్రమే పిల్లర్ల నిర్మాణాలను కాంట్రాక్టర్ చేపట్టారు. వీటికి సంబంధించి రూ.5కోట్ల వ్యయం చేసినట్లుగా ఆర్అండ్‌బీ శాఖ ప్రభుత్వానికి బిల్లులు పంపించింది. అవి విడుదల కాకపోవడంతో ఆ పనులు నిలిచిపోయాయి. మరోవైపు భూసేకరణ చేపట్టాల్సి ఉండటంతో అటువైపుగా ఇప్పటివరకు దృష్టి సారించడం లేదు.

ఆర్‌యూబీ పనులు మొదలే కాలే

తాంసి బస్టాండ్ వద్ద గల రైల్వేట్రాక్‌పై చేపట్టాల్సిన రైల్వే అండర్ బ్రిడ్జి పనులు అసలు మొదలే కాలేదు. ఇక్కడ 292 మీటర్ల పొడవు పనులు రోడ్లు భవనాలశాఖ , మరో 46 మీటర్ల రైల్వేట్రాక్‌పైన రైల్వేశాఖ పనులు చేపట్టాల్సి ఉంది. అయితే ఇక్కడ భూసేకరణ చేపట్టకపోవడంతో ఇప్పటి దాకా పనులే ప్రారంభం కాలేదు. ఈ నిర్మాణంతో షాపులు, ఇళ్లను కోల్పోతున్న నిర్వాసితులకు నష్ట పరిహారం అందించేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.27 కోట్లు కేటాయించినప్పటికీ వాటిని విడుదల చేయలేదు. తమకు పరిహారం చెల్లించాకే పనులు ప్రారంభించాలని అక్కడి వ్యాపారులు కోర్టును ఆశ్రయించడంతో దానిపై స్టే విధించింది. దీంతో ఆ పనులు మొదలే కాలేదు. భూసేకరణకు సంబంధించి ప్రభుత్వం నిధులు విడుదల చేస్తే తప్ప రెండుచోట్ల పనులు మొదలయ్యే పరిస్థితి కన్పించడం లేదు. ఇటీవల ఆర్అండ్‌బీ, మున్సిపల్, రైల్వేశాఖల అధికారులతో కలెక్టర్, ఎమ్మెల్యే ప్రత్యేక సమావేశం నిర్వహించి నిధులు త్వరితగతిన వచ్చేలా చూస్తామని ప్రకటించారు. ఆ నిధులు విడుదలైతే రెవెన్యూశాఖ నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించి భూసేకరణ చేపట్టనున్నారు. అది జరిగితే బ్రిడ్జిల నిర్మాణ పనులు వేగంగా సాగే అవకాశముంటుంది.

ప్రభుత్వ స్థాయిలోనే పెండింగ్

ఆర్‌యూబీ, ఆర్‌వోబీల నిర్మాణ పనులు ముందుకు సాగాలంటే భూ సే కరణ చేపట్టాల్సి ఉ ంటుంది. ఇప్పటికే వాటి కోసం ఎంత వరకు భూమి అవసరమనే దానిపై మా ర్కింగ్ చేసి రెవెన్యూ, మున్సిపల్ అధి కారులకు వివరాలు అందజేశాం. భూ సేకరణకు సంబంధించి నిధులు రాష్ట్రస్థాయిలోనే పెండింగ్‌లో ఉన్నాయి. అవి విడుదలైతే భూ సేకరణ చేపట్టి పనులు వేగవంతం చేసే అవకాశముంటుంది.

– సురేశ్ రాథోడ్, డీఈ, ఆర్అండ్‌బీ

ఆడబిడ్డల కష్టాలు తొలగించేందుకే 'ఉజ్వల'

- ఎంపీ సోయం బాపూరావు

కైలాస్‌నగర్: కట్టెల పొయ్యిపై వంట చేసేందుకు ఆడబిడ్డలు అవస్థలు పడకూడదనే ఉద్దేశంతో ప్రధాని మోదీ ఉజ్వల పథకం కింద ఉచిత గ్యాస్ కనెక్షన్లను అందజేస్తున్నారని ఎంపీ సోయం బాపూరావు, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. ఈ పథకం కింద ఎంపికైన పట్టణంలోని వివిధ కాలనీలకు చెందిన వంద మంది లబ్ధిదారులకు స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో సిలిండర్లు, స్టౌవ్‌తో పాటు మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. దేశంలోని మహిళలు ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతో గ్యాస్ కనెక్షన్ లేని పేదలకు ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. అరులంతా సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు జోగు రవి, వేద వ్యాస్, జ్యోతిరెడ్డి, ధోని జ్యోతి, ఆనంద్, రవిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.




లబ్ధిదారుకు స్టౌవ్ అందజేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

సిరికొండలో సీసీ రోడ్డు పనులు ప్రారంభం

సిరికొండ: మండల కేంద్రంలో ఉపాధి హామీ పథకం నిధులతో మంజురైన సీసీ రోడ్ల పనులను ఎంపీ సోయం బాపూరావు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వ హయాంలో గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి చెందాయని, కేంద్రంలో మారోసారి బీజేపీ ప్రభుత్వం ఏర్పడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో బాలగంగాధర్, బీజేపీ మండలాధ్యక్షులు అమోల్, కోఆప్షన్ సభ్యులు మాణిక్‌రావు, నాయకులు బాలాజీ, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

41వ రోజుకు 'రైల్వేలైన్ సాధన' దీక్ష



శిబిరంలో అర్ధనగ్న ప్రదర్శనతో నిరసన వ్యక్తం చేస్తున్న కమిటీ సభ్యులు

కైలాస్‌నగర్: రైల్వే అంశంలో కేంద్ర ప్రభుత్వం ఆదిలాబాద్ జిల్లాపై సవతి తల్లి ప్రేమ చూపుతోందని రైల్వేలైన్ సాధన కమిటీ చైర్మన్ సిర్ర దేవేందర్, ప్రధాన కార్యదర్శి నిమ్మల నరేందర్ ఆరోపించారు. ఆదిలాబాద్–ఆర్మూర్ రైల్వే లైన్‌కు నిధులు విడుదల చేయాలనే డిమాండ్‌తో కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలేదీక్షలు 41వ రోజుకు చేరాయి. ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్ వద్ద గల శిబిరంలో కమిటీ సభ్యులు ఆదివారం అర్ధనగ్న ప్రదర్శనతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. నాగ్‌పూర్ –హైదరాబాద్ ఇండస్ట్రీయల్ కారిడార్‌లో భాగంగా నోడ్–2 ఫేజ్–2కు తక్షణమే బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. జిల్లాలో రైల్వేలైన్‌తో పాటు సిమెంట్ ఫ్యాక్టరీ, విమానాశ్రయం ఏర్పాటు చేసేలా కేబినెట్‌లో చర్చించి మంజూరు చేసేలా కేంద్రం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో జిల్లా ప్రజలు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు వెంకట్ నారాయణ, అఫ్సర్‌ఖాన్, సభ్యులు భాస్కర్, కేశవ్, నాగేందర్, నితీష్, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఎట్లుండె.. ఎట్లాయె!

- కళావిహీనంగా గాంధీ పార్కు
- జిల్లా కేంద్రంలో కరువైన ఆహ్లాదం
- పట్టించుకోని యంత్రాంగం
- 'నాలుగు దశాబ్దాల' వనం.. అభివృద్ధికి దూరం



జిల్లా కేంద్రంలోని గాంధీ పార్కు

సాక్షి, ఆదిలాబాద్: కలెక్టర్ క్యాంప్ కార్యాలయానికి ఎదురుగా ఉండే గాంధీపార్క్ కళావిహీనంగా తయారైంది. పచ్చదనం కరువై ప్రకృతి వనం బోసిపోతోంది. నాలుగు దశాబ్దాల క్రితం రూపుదిద్దుకున్న ఈ గార్డెన్ నవీకరించడంలో యంత్రాంగం పూర్తిగా విఫలమైందనే విమర్శలున్నాయి. అప్పట్లోనే ఇందులో వెలుగుజిలుగుల మధ్య వాటర్ ఫౌంటెన్స్.. కనువిందు చేసే పచ్చదనం.. పక్షులు, పావురాలు, నెమళ్లు, కోతులు, జింకలు, కుందేళ్లకు ఆవాసం.. పిల్లల కోసం ప్రత్యేకంగా ఆడుకునేందుకు పరికరాలు ఉండేవి. ఇలా పట్టణ ప్రజలకు ఇది ఎంతో ఆహ్లాదం పంచేది. ఒకప్పుడు కలెక్టర్లు కూడా విరామ సమయంలో ఇక్కడికి వచ్చి సేద తీరేవారు. పార్కు అభివృద్ధి కోసం ప్రత్యేకంగా నిధులు కేటాయించేవారు. ప్రస్తుతం అలాంటి పార్కు పూర్తిగా అధ్వానంగా మారింది. ఈ పార్కు డెవలప్‌మెంట్ కమిటీకి కలెక్టరే చైర్మన్. కన్వీనర్‌గా డీవైఎస్‌వో, మెప్మా పీడీగా వ్యవహరించే అదనపు కలెక్టర్ సెక్రెటరీగా ఉన్నారు.

పట్టణ నడిబొడ్డులో..

జిల్లా కేంద్రానికి నడిబొడ్డులో ఈ పార్కు ఉంది. ఓ పక్కన ఇందిరా ప్రియదర్శిని స్టేడియం, మరో పక్కన కలెక్టర్, ఎస్పీ, జిల్లా జడ్జి, జిల్లా ఉన్నతాధికారుల క్యాంప్ కార్యాలయాలు ఉంటాయి. మున్సిపల్ జనాభా ప్రస్తుతం 1లక్ష 80వేలు ఉంది. పట్టణ ప్రజలకు ఆహ్లాదం కోసం సమీపంలో ఉన్న ఏకైక పెద్ద వనం ఇదే. మావలలో మరో పార్కు ఉన్నప్పటికీ అది దూరంగా ఉండడంతో పట్టణ ప్రజలకు ఇదే అనువుగా ఉంటుంది. ప్రతిరోజు సుమారు 200 నుంచి 300 మంది వరకు వస్తుంటారు. శని, ఆదివారాలు, సెలవు దినాల్లో 500 నుంచి 600 మంది వరకు పిల్లాపాపలతో వచ్చి సేద తీరుతుంటారు. ఎంట్రీ టికెట్ ప్రస్తుతం రూ.10 చొప్పున వసూలు చేస్తున్నారు.

పబ్లిక్–ప్రైవేట్ పార్టనర్‌షిప్‌లో..

ఈ పార్కులో ప్రజల ఆహ్లాదం కోసం 13 ఎకరాల వరకు అందుబాటులో ఉంచారు. మిగతా ఏడెకరాల్లో గతంలో ఉసిరి వనం ఏర్పాటు చేయగా, అది పూర్తిగా కోల్పోయి ప్రస్తుతం పిచ్చిమొక్కలతో దర్శనమిస్తుంది. గేట్ ఎంట్రీ, క్యాంటీన్‌లను ఓ కాంట్రాక్టర్‌కు నెలకు రూ.1లక్ష 38వేలకు అప్పగించారు. ఆ కాంట్రాక్టర్ పార్కు లోపల వివిధ ఆట వస్తువులను ఏర్పాటు చేయడం ద్వారా ఆదాయం పొందుతూ రెంట్ కడుతున్నారు. అయితే పార్కును పూర్తిస్థాయిలో పబ్లిక్–ప్రైవేట్ పార్టనర్‌షిప్‌లో అప్పగించి పచ్చదన అభివృద్ధితో పాటు వివిధ అడ్వెంచర్ గేమ్స్ ఏర్పాటు చేయడం ద్వారా మంచి ఆదాయం పొందే అవకాశాలున్నాయి.





గాంధీ పార్కులో పచ్చదనం కోల్పోయి మైదానంలా కనిపిస్తున్న దృశ్యాలు

కోల్పోతున్న పచ్చదనం

20 ఎకరాల విస్తీర్ణంలో పెద్దపెద్ద చెట్లతో నాడు చిన్నపాటి అడవినే తలపించేది. అయితే కొన్నేళ్లుగా దీని అభివృద్ధిని విస్మరించారు. చాలా వరకు చెట్లు నేలకొరిగిపోయాయి. వాటి స్థానంలో కొత్త మొక్కలు పెంచే ప్రణాళిక లేదు. ప్రస్తుతం పచ్చదనం అక్కడక్కడా తప్పిస్తే పూర్తిస్థాయిలో ఎండిపోయి మైదానంలా దర్శనమిస్తోంది. పక్షులు, పావురాలు, వన్యప్రాణుల కోసం ఏర్పాటు చేసిన ఆవాసాలు బోసిపోయి కనిపిస్తున్నాయి. ఈ స్థలం కైలాస్‌నగర్ వార్డు పరిధిలోకి వస్తుంది. ఇక్కడ ప్రధానంగా నీటి సమస్య ఉంది. పార్కులో ఎన్నో బోర్లు వేసినప్పటికీ కేవలం ఒక్కటి మాత్రమే ప్రస్తుతం పనిచేస్తుంది. దానిద్వారా ఎకరాల విస్తీర్ణంలో ఉన్న గ్రీనరీకి నీటిని సరఫరా చేయలేని పరిస్థితి. ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషించడంలో యంత్రాంగం పూర్తిగా విఫలమైందనే విమర్శలున్నాయి.

అభివృద్ధికి చర్యలు..



పార్కు మెయింటనెన్స్ మా శాఖ ఆధీనంలో ఉన్నప్పటికీ అభివృద్ధి పనుల పరంగా మున్సిపాలిటీ నుంచే చేపట్టాలి. ఇటీవల కొత్త కమిషనర్ వచ్చారు. పచ్చదనం అభివృద్ధి విషయంలో కమిషనర్‌తో చర్చిస్తాను.

– వెంకటేశ్వర్లు, డీవైఎస్‌ఓ, ఆదిలాబాద్

పీపీపీ పద్ధతిలో వెళ్తేనే బెటర్..



ఎన్నో ఏళ్లుగా పార్కు అభివృద్ధిపై దృష్టి పెట్టడం లేదు. పబ్లిక్–ప్రైవేట్ పార్టనర్‌షిప్ (పీపీపీ)లో టెండర్‌పై ఎవరికైనా అప్పగించాలి. తద్వారా పార్కులో మొక్కల పెంపకం, పచ్చదనం అభివృద్ధితో పాటు అడ్వెంచర్ గేమ్స్ ఏర్పాటు ద్వారా ప్రజలను ఆకర్షించవచ్చు. ప్రభుత్వానికి ఆదాయం లభిస్తుంది. గతంలో పార్కు చాలా బాగుండే. ఇప్పుడు అధ్వానంగా మారింది.

– గోవర్ధన్‌రెడ్డి, ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు

క్లుప్తంగా

రైలు ఢీకొని వ్యక్తి మృతి

రామకృష్ణాపూర్: క్యాతనపల్లి రైల్వేగేటు సమీపంలో శనివారం రాత్రి రైలు ఢీకొన్న సంఘటనలో శేషుపల్లి గ్రామానికి చెందిన కుర్మ కుమార్ (36) మృతిచెందాడు. మంచిర్యాల రైల్వేహెడ్ కానిస్టేబుల్ రాజేశ్వర్ కథనం ప్రకారం.. గద్దెరాగడి నుంచి కుర్మ కుమార్ కాలినడకన ఇంటికి వెళ్తున్నాడు. కొత్త బ్రిడ్జి వద్ద పట్టాలు దాటుతుండగా గుర్తుతెలియని రైలు ఢీకొని చనిపోయాడు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదానికి కారణమైన వ్యక్తి అరెస్టు

చెన్నూర్‌రూరల్: మండలంలోని కత్తెరసాల సమీపంలోని బ్రిడ్జి వద్ద ప్రమాదానికి కారణమైన వ్యక్తిని ఆదివారం అరెస్టు చేసినట్లు పట్టణ సీఐ రవీందర్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. కత్తెరసాల సమీపంలో శనివారం బొలెరో వాహనం రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో కంకణాల దేవేందర్‌రెడ్డి, ఎండీ సైఫ్ అలీ మృతి చెందాడు. బైక్ వెనకాల కూర్చున్న ఎండీ ఆబిద్‌కు తీవ్ర గాయాలు కాగా, చికిత్స పొందుతున్నాడు. మృతుడు దేవేందర్‌రెడ్డి భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. మద్యం తాగి బొలెరో వాహనాన్ని అజాగ్రత్తగా నడిపి ప్రమాదానికి కారణమైన కోటపల్లి మండలం పారిపల్లి వాసి గడల తిరుపతిని రిమాండ్‌కు తరలించినట్లు పట్టణ సీఐ రవీందర్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం రాపల్లి స్టేజీ వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. వివరాలు ఇలా ఉన్నాయి.. లక్సెట్టిపేట మండలం గుల్లకోటకు చెందిన గుర్రాల శ్రీధర్‌రెడ్డి (45) బైక్‌పై మంచిర్యాలలోని హైటెక్‌సిటీలో తన ఇంటికి వెళ్తున్నాడు. ఇదే సమయంలో మంచిర్యాల నుంచి లక్సెట్టిపేట వైపు వస్తున్న ఆటోను బైక్ వేగంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో శ్రీధర్‌రెడ్డి తలకు తీవ్రగాయాలు కాగా మంచిర్యాలలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందాడు. హాజీపూర్‌కు చెందిన ఆటో డ్రైవర్ మహేశ్‌తోపాటు ప్రయాణికులకు ఎలాంటి ప్రమాదం జరగలేదు. కాగా, ఈ ఘటనపై పోలీస్ స్టేషన్‌లో ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

గజ్జలమ్మ దేవికి పూజలు

కుంటాల: కుంటాల ఆరాధ్యదైవం శ్రీ గజ్జలమ్మ ముత్యాలమ్మ మహాలక్ష్మి ఆలయాల్లో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురుస్వామి జక్కని గజేందర్, అర్చకుడు నగేశ్ ఆధ్వర్యంలో పూజలు చేశారు. మహారాష్ట్రలోని ముంబై, నాందేడ్, బోకర్, ధర్మాబాద్, అప్పారావుపేట్, శివుని, మలక్‌జాం, హిమాయత్‌నగర్, ఇస్లాపూర్ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి పూజలు చేశారు. చిన్నపిల్లలకు తులాభారం, తలానీలాలు అర్పించి మొక్కు చెల్లించుకున్నారు. నిజామాబాద్ జిల్లా బాల్కొండ గ్రామానికి చెందిన గాజుల గోదావరి.. అమ్మవారికి రెండు తులాల వెండిని బహూకరించారు. ఆలయ కమిటీ సభ్యులు ఆమెను సన్మానించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

అడ్మిషన్స్: 10th, ఇంటర్, డిగ్రీ, డిప్లొమా, PG /B.Tech/M.Tech/MBA/MCA/MS/MBBS/D/B/M ఫార్మసీ, FAST TRACK (ఫెయిల్ స్టూడెంట్) WT'S app: PH: 7993080835. [HA-1267]

SERVICES
BUSINESS OFFER

కంపెనీ అన్ని రకాల బిజినెస్ ల్యాప్ ప్రాజెక్ట్‌ను అందిస్తుంది.వ్యక్తిగత,విద్య,టేక్ఓవర్ అగ్రికల్చర్ ఏజెంట్‌కావలెను.DMA Welcome, Salary + కమీషన్ ఆఫీసు, ఖర్చులు, ✆ 9773917835. [T-1252668]

WANTED

ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పురుషులు కావలెను. వీక్లీ పేమెంట్. మీ పేరు, అడ్రస్ కాల్/వాట్సప్ చేయగలరు. 9059683584. [M-1233857]

హరేకృష్ణ హోమ్ కేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి+భోజనం. జీ: 18k ఫోన్: 9640258899 / 9640468899. [H-793694]


గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602888
9010299065
9951602823
9010608462

సల్లంగ సూడమ్మా..

- ముగిసిన గాంధారి మైసమ్మ జాతర
- వేలాదిగా తరలివచ్చిన ఆదివాసీలు


ఖిల్లాలోని దర్వాజ వద్ద బారులు తీరిన భక్తులు


కాలభైరవుడి విగ్రహం వద్ద మొక్కులు చెల్లిస్తున్న ఎమ్మెల్యే వివేక్

రామకృష్ణాపూర్: మందమర్రి మండలం బొక్కలగుట్ట శివారులోని గాంధారి ఖిల్లా వద్ద మూడు రోజులుగా నిర్వహిస్తున్న గాంధారి మైసమ్మ జాతర ఆదివారం పెద్దపూజతో వైభవంగా ముగిసింది. మైసమ్మ తల్లిని దర్శించుకునేందుకు ఆదివాసీ నాయక్‌పోడ్‌లు వేలాదిగా తరలివచ్చారు. జాతరలో చివరిరోజైన ఆదివారం తెల్లవారుజాము గాంధారీ ఖిల్లా దిగువ భాగంలో ఉన్న జీడికోట నుంచి మైసమ్మతల్లి వద్దకు ఆదివాసీలు సంప్రదాయ తప్పెటగూళ్ల ఆటలతో, డప్పుచప్పుళ్లతో చేరుకున్నారు. అక్కడ గిరిజనులు తీసుకువచ్చిన గంగాజలంతో దేవతామూర్తులను శుద్ధిచేసి మైసమ్మతల్లి వద్ద పట్నాలు వేశారు. తర్వాత నైవేద్యం పెట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. ఈ జాతరలో పాల్గొనేందుకు జిల్లాతోపాటు పక్క జిల్లాల నుంచి ఆదివాసీ నాయక్‌పోడ్‌లు, భక్తులు తరలివచ్చారు.

పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతా: ఎమ్మెల్యే

గాంధారి ఖిల్లా ప్రాంతాన్ని టూరిజం ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ అన్నారు. మూడు రోజుల జాతరలో ముగింపు ఉత్సవాలకు ఆయన హాజరయ్యారు. ఖిల్లాపైకి వచ్చి కాలభైరవుడి విగ్రహం వద్ద పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జాతర నిర్వహణకు కలెక్టర్‌తో మాట్లాడి రూ.5 లక్షలు ఇప్పించానని అన్నారు. ఖిల్లాలో వెలిసిన మైసమ్మ తల్లి గొప్ప శక్తి స్వరూపిని అని, తెలంగాణ ఉద్యమ సమయంలో ప్రత్యేకరాష్ట్రం రావాలని ఆనాడు అమ్మవారిని మొక్కుకున్నానని గుర్తుచేశారు. ఖిల్లా వరకు బీటీ రోడ్డు నిర్మించేందుకు అటవీశాఖ అనుమతులు అవసరమని ఇందుకు తాను కృషి చేస్తానని చెప్పారు. నియోజకవర్గంలో ట్రైబల్ పాఠశాల ఏర్పాటుకు కృషి చేస్తానని, గాంధారి ఖిల్లాలో భక్తుల సౌకర్యార్థం శాశ్వత ప్రాతిపదికన మంచినీటి ట్యాంకు నిర్మాణాన్ని చేపడుతామన్నారు. అనంతరం నాయక్‌పోడ్‌లు ఎమ్మెల్యేకు పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు, క్యాతనపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ జంగం కళ, బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్, మందమర్రి తహసీల్దార్ చంద్రశేఖర్, నాయక్‌పోడ్ సేవాసమితి నాయకులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యేకు వినతిని అందిస్తున్న నాయకులు


మైసమ్మ తల్లికి మొక్కులు చెల్లిస్తున్న భక్తులు


తల్లిని దర్శించుకునేందుకు వస్తున్న భక్తులు

అధ్వానంగా సింగరేణి గార్డెన్



నస్పూర్ కాలనీలోని సింగరేణి గార్డెన్

- నిర్వహణ అస్తవ్యస్తం
- పగిలిపోయిన టైల్స్
- పేరుకే ఏసీ హాల్
- పట్టించుకోని అధికారులు

శ్రీరాంపూర్: నస్పూర్ కాలనీలోని సింగరేణి గార్డెన్ నిర్వాహణ అధ్వానంగా మారింది. కార్మిక కుటుంబాలు వివాహాది, శుభకార్యాలు చేసుకోవడానికి శ్రీరాంపూర్ ఏరియాలో ఏర్పాటు చేసిన ఏకైక ఏసీ ఫంక్షన్ హాల్ ఇదొక్కటే ఉంది. ఐతే దీని నిర్వహణ సరిగ్గా లేకపోవడంతో శుభకార్యాలు చేసుకునేవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో దీన్ని ఓల్డ్ కమ్యూనిటీహాల్ అనేవారు. మూడేళ్ల క్రితం ఇందులో ఏసీలు, టైల్స్ పెట్టి ఇతర హంగు ఆర్భాటాలతో ఆధునీకరించారు. ఇంత చేసిన నిర్వహణను గాలికి వదిలేశారు. హాల్‌లో ఉన్న ఏసీలు కొన్ని పనిచేయడం లేదు. పని చేస్తున్న ఏసీల రిమోట్‌లు మాత్రం జీఎం కార్యాలయంలోనే ఉంటాయి. వాటిని ఆన్‌చేస్తే ఒక్కో ఏసీ ఒక్కో టెంపరేచర్ మీద రన్ అవుతున్నాయి. రిమోట్లు అందుబాటులో లేకపోవడంతో చల్లదనం సరిపడా రావడం లేదు. స్టేజీపై ఉన్న కొన్నిటైల్స్ పగిలిపోయాయి. దీంతో వేదికపై వచ్చి వెళ్లేవారికి కాళ్లకు గాయాలవుతున్నాయి. దీనికితోడు కొన్ని లైట్లు పనిచేయడం లేదు.


పాకురుతో ఉన్న మంచినీటి ట్యాంక్

మురికి పట్టిన డైనింగ్ హాల్..

డైనింగ్ హాల్ అయితే మరింత అధ్వానంగా ఉంది. ఫ్లోర్ సరిగ్గా శుభ్రం చేయకపోవడంతో మురికిపట్టి నల్లగా మారి దుర్గంధం వెదజల్లుతుంది. కిచెన్ ఏరియాలో వంట సామగ్రి, ప్లేట్లు కడుక్కోవడానికి ఉన్న మంచినీటి ట్యాంకు అపరిశుభ్రంగా ఉంది. అందులో చెత్తాచెదారం, పాకురు, ప్లాస్టిక్‌పైపులు అధ్వానంగా మారింది. ప్లేట్లు శుభ్రం చేసుకోవడానికి నీటిని తోడితే అందులో పురుగులు వస్తున్నాయని వంట మనుషులు పేర్కొంటున్నారు. డైనింగ్ సెక్షన్ షెడ్డు ఎత్తు తక్కువగా ఉండటంతో వేసవిలో వేడి, తీవ్ర ఉక్కపోతతో శుభకార్యాలకు హాజరైనవారు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైన దీని నిర్వహణపై ఉన్నతాధికారులు దృష్టిపెట్టి సమస్యలు పరిష్కరించాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు.

ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.కోటి ఎక్స్‌గ్రేషియా

- నేడు యూబీఐతో సింగరేణి యాజమాన్యం ఒప్పందం

మందమర్రిరూరల్: సింగరేణి ఉద్యోగి ప్రమాదవశాత్తు విధి నిర్వహణలో కాని, బయట గాని మరణిస్తే బాధిత కుటుంబానికి రూ.కోటి ఎక్స్‌గ్రేషియా చెల్లించడానికి యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (యూబీఐ) అంగీకరించిందని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య ఓ ప్రకటనలో తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో యూబీఐతో ఒప్పందం చేసుకోనున్నట్లు పేర్కొన్నారు. మృతిచెందిన కార్మిక కుటుంబాలకు రూ.కోటి చెల్లించాల్సిందేనని పలు దఫాలుగా చేపట్టిన ఆందోళనల ఫలితంగా యూబీఐ అంగీకరించిందని తెలిపారు. ఉద్యోగి ప్రతిఏటా రూ.274 అదనంగా చెల్లిస్తే మరో రూ.30 లక్షలు చెల్లించడానికి అంగీకరించారని సీతారామయ్య వివరించారు. సింగరేణి ఉద్యోగులు వివిధ బ్యాంకుల్లో ఖాతాదారులుగా ఉన్నారని తెలిపారు. యూబీఐ మాదిరిగా మిగతా బ్యాంకులు రూ. కోటి ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని లేకపోతే యూబీఐకి వేతనాలు బదిలీ చేసుకోవాల్సి వస్తుందని పేర్కొన్నారు.

ఏఐటీయూసీ కృషితోనే..

కాసిపేట: ఏఐటీయూసీ కృషి ఫలితంగా సింగరేణి కార్మికులు ప్రమాదవశాత్తు మృతిచెందితే రూ.కోటి ఎక్స్‌గ్రేషియా చెల్లించేందుకు యూబీఐ అంగీకరించిందని బెల్లంపల్లి బ్రాంచి కార్యదర్శి దాగం మల్లేశ్ ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య బ్యాంకు అధికారులతో చర్చలు జరిగాయని పేర్కొన్నారు. ఇతర బ్యాంకులు సైతం ఇదే విధంగా ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని కోరారు.

ముగిసిన సెపక్‌తక్రా పోటీలు

నల్లగొండ: నల్లగొండలోని ఎన్జీ కాలేజీలో జూనియర్, సబ్ జూనియర్ అంతర్ జిల్లా సెపక్‌తక్రా చాంపియన్ షిప్‌పోటీలు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎండీ మక్బూల్ అహ్మద్ మాట్లాడుతూ క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొని ప్రతిభ కనబర్చారని అన్నారు. అనంతరం గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. ఆర్గనైజింగ్ ప్రెసిడెంట్ ప్రేమ్‌రాజ్, సురేష్ పాల్గొన్నారు. జూనియర్ బాలుర విభాగంలో రంగారెడ్డి జట్టు ప్రథమ స్థానంలో నిలిచింది. ఆదిలాబాద్ జట్టు ద్వితీయ స్థానం, హైదరాబాద్-నిజామాబాద్ జట్లు సంయుక్తంగా తృతీయ స్థానంలో నిలిచింది. రంగారెడ్డి జట్టుకు 3 బంగారు పతకాలు, నిజామాబాద్‌కు ఒక బంగారు పతకం, ఒక రజతం, ఒక కాంస్యం లభించింది. నల్లగొండ జట్టు ఒక రజతం , ఒక కాంస్యం సాధించింది. ఆదిలాబాద్ ఒక రజతం, ఒక కాంస్యంతో తమ నైపుణ్యాన్ని ప్రదర్శించింది. హైదరాబాద్, వరంగల్ జట్లు చెరో రెండు కాంస్య పతకాలను సాధించగా, మహబూబ్‌నగర్ ఒక రజత పతకాన్ని కైవసం చేసుకుంది.



పతకాలతో ఆదిలాబాద్ బాలుర జట్టు క్రీడాకారులు



విజేతలతో బాలుర క్రీడాకారులు

కళ్లకు గంతలతో బైక్‌లపై అయోధ్యకు

కైలాస్‌నగర్: హైదరాబాద్‌కు చెందిన మెజీషియన్లు మారుతిజోషి, రామకృష్ణ కళ్లకు గంతలు కట్టుకొని అయోధ్యకు బైక్‌లపై యాత్ర చేస్తున్నారు. ఆదివారం ఈ యాత్ర జిల్లా కేంద్రానికి చేరుకోగా వారిని ఎంపీ సోయం బాపూరావు సన్మానించారు. స్థానిక శ్రీ రామచంద్ర గోపాలకృష్ణ మఠంలో జరిగిన కార్యక్రమంలో మఠాధిపతి యోగానంద సరస్వతితో కలిసి పూలమాల, శాలువలతో సత్కరించారు. యాత్రకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా సురక్షితంగా అయోధ్యకు చేరుకుని బాలరాముని దర్శించుకోవాలని ఆకాంక్షించారు. దశాబ్దాలుగా ప్రజలు ఎదురుచూసిన అయోధ్య భవ్య రామమందిర నిర్మాణ కలను ప్రధాని మోదీ సాకారం చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో పలువురు స్వాములు తదితరులు పాల్గొన్నారు.


యాత్రికులను సన్మానిస్తున్న ఎంపీ సోయం

రక్తకణాలు తగ్గి మహిళ మృతి

లక్ష్మణచాంద: రక్తకణాలు తగ్గి మహిళ మృతి చెందింది. మండలంలోని చామన్‌పెల్లిలో ఈ ఘటన చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన కొమ్మోజి లక్ష్మి(42)కి శనివారం జ్వరం వచ్చింది. కుటుంబ సభ్యులు ఆమెను నిర్మల్‌లోని ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించారు. వైద్యులు పరీక్షలు చేయగా రక్తకణాలు తగ్గాయని ప్లేట్‌లెట్స్ ఎక్కించాలని తెలిపారు. రాత్రి ఆమెకు ప్లేట్‌లెట్స్ ఎక్కించినా పెరగకపోవడంతో ఆరోగ్యం మరింత క్షీణించింది. కుటుంబ సభ్యులు ఆదివారం ఉదయం 5 గంటల సమయంలో అంబులెన్స్‌లో నిజామాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందింది. మృతురాలికి భర్త శంకర్, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. సాయంత్రం గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు.

అదృశ్యమైన యువతి.. బావిలో శవమై..


మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ, ఎస్సై

పెంచికల్‌పేట్: గత రెండు రోజుల క్రితం ఇంటి నుంచి అదృశ్యమైన గుండెపల్లి గ్రామానికి చెందిన యువతి తలండి నిర్మల(26) వ్యవసాయ బావిలో ఆదివారం శవమై తేలింది. కుటుంబీకులు, గ్రామస్తులు తెలిపిన వివరాలు.. గుండెపల్లికి చెందిన నారాయణ-వెంకుబాయి దంపతుల కుమార్తె నిర్మల బెజ్జూర్ మండలంలోని కోయపెల్లికి చెందిన రవికుమార్ గత రెండేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. శుక్రవారం ఇంటి నుంచి నిర్మల అదృశ్యమైంది. కుటుంబ సభ్యులు, బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ దొరకలేదు. ఆదివారం మధ్యాహ్నం వ్యవసాయ బావి సమీపంలో రక్తపు మరకలు, చెప్పులు చూసిన కుటుంబీకులు గ్రామస్తుల సహాయంతో బావిలో వెతకగా మృతదేహం లభ్యమైంది. స్థానికుల సమాచారంతో అక్కడికి చేరుకున్న కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్, కాగజ్‌నగర్ రూరల్ సీఐ నాగరాజు, పెంచికల్‌పేట్ ఎస్సై కొమురయ్యలు మృతదేహాన్ని పరిశీలించారు. ప్రేమించిన యువకుడే నిర్మలను హత్య చేసి బావిలో పడేసినట్లు మృతురాలి తండ్రి ఆరోపించారు. అతని ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వాహనం ఢీకొని ఒకరికి గాయాలు

మంచిర్యాలరూరల్(హాజీపూర్):మండలంలోని గుడిపేట వద్ద శనివారం అర్ధరాత్రి జరిగిన రో డ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యా యి. ఎస్సై సురేశ్ కథనం ప్రకారం..గుడిపేటకు చెందిన దొరిశెట్టి రాజయ్య తన బైక్‌పై మంచిర్యాలకు వెళ్లి తిరిగి ఇంటి వస్తున్నాడు. లక్సెట్టిపేట నుంచి మంచిర్యాల వైపు వస్తున్న గుర్తు తెలియని వాహనం వేగంగా వచ్చి బైక్‌ను ఢీ కొంది. రాజయ్యకు తీవ్ర గాయాలు కాగా మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మె రుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవే ట్ ఆస్పత్రికి పంపించారు. రాజయ్యకు వరుస సోదరుడు సూర్యప్రకాశ్ ఫిర్యాదుతో ఆదివారం కేసు నమోదు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఒకరికి గాయాలు

నిర్మల్: సారంగాపూర్ మండలం అడెల్లి గ్రామంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు..మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా మాలోజీ గ్రామానికి చెందిన రేయిండ్ల సాయినాథ్(40) బైక్‌పై అడెల్లిలోని తన బంధువుల శుభకార్యానికి వచ్చాడు. తిరిగి స్వగ్రామానికి బయల్దేరాడు. ఈ క్రమంలో అడెల్లి చేరుకోగానే గుర్తుతెలియని ఆటో బైక్‌ను ఢీకొట్టింది. సాయినాథ్ కుడికాలికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రుడిని అంబులెన్స్‌లో నిర్మల్ ఏరియా ఆసుపత్రికి తరలించారు.

జాతీయస్థాయిలో గోల్డ్‌మెడల్


గోల్డ్ మెడల్ సాధించిన జిల్లా క్రీడాకారులు

నేరడిగొండ: జూనియర్ జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు గోల్డ్‌మెడల్ సాధించారు. బిహార్ రాష్ట్రం పట్నాలో ఈనెల 21 నుంచి 25 వరకు 41వ జూనియర్ జాతీ యస్థాయి సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించారు. ఇందులో అండర్ 23-24 బాల,బాలికలు పాల్గొన్నారు. ఫైనల్‌లో తెలంగాణ, కేరళ జట్లు తలపడ్డాయి. కేరళ జట్టుపై ఒక రన్ తేడాతో విజయం సాధించారు. ఆదిలాబాద్ జిల్లా బాలుర నుంచి అఖిల్, బాలికల నుంచి డి.శిరీష, ఎం.అలేఖ్య, బి.వనిత నేరడిగొండ క్రీడాకారులు పాల్గొని బంగారు పతకాలు సాధించారు. ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌తోపాటు, ప్రధాన కార్యదర్శి గస్కంటి గంగాధర్, జిల్లా ఎస్‌ఐఎస్ కోచ్ ఓ.అఖిల, అసోసియేషన్ సభ్యులు, జిల్లా పేట అధ్యక్ష, కార్యదర్శులు వారిని అభినందించారు.

రెండోరోజూ టీసీసీ పరీక్ష

మంచిర్యాలఅర్బన్: టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు (టీసీసీ) పరీక్ష రెండోరోజు ఆదివారం ప్రశాంతంగా జరిగాయి. జిల్లాకేంద్రంలో జెడ్పీ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన పరీక్ష కేంద్రంలో డ్రాయింగ్ లోయర్, హైయర్ పరీక్షలు నిర్వహించారు. ఉదయం పరీక్షకు 513 మందికి గాను 367 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షకు 513 మందికి గాను 366 మంది హాజరైనట్లు డీఈవో యాదయ్య తెలిపారు. పరీక్ష కేంద్రాలను ఏసీజీఈ దామోదర్‌రావు పరిశీలించారు.

గోదావరి తీరంలో స్వచ్ఛభారత్

భైంసా: బాసర గోదావరి నదితీరంలో సంత్ నిరాకారి నిజామాబాద్ శాఖ సంయోజక్ లక్ష్మణ్ నేతృత్వంలో ఆదివారం స్వచ్ఛభారత్ నిర్వహించారు. సభ్యులంతా గోదావరి నది పరీ వాహక ప్రాంతాల్లో, స్నానఘట్టాల వద్ద చెత్తను తొలగించారు. దశరథ మహరాజ్ ఆశ్రమ పరిసర ప్రాంతాల్లో శుభ్రత కార్యక్రమాలు చేపట్టారు. 100 మంది సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

కుక్కలదాడిలో చిన్నారులకు గాయాలు

తానూరు:మండలంలోని తొండాల గ్రామంలో ఆదివారం వీధి కుక్కల దాడిలో ముగ్గురు చిన్నారులకు గాయాలయ్యాయి. చిన్నారులు ఆడుకుంటుండగా ఆదిత్య, సాయినాథ్, విలాస్‌పై వీధి కుక్కలు దాడి చేసి గాయపర్చింది. కుటుంబీకులు వారిని ధర్మాబాద్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

తాంసి: మండలంలోని జామిడి గ్రామంలో షార్ట్ సర్క్యూట్‌తో బుద్ద ప్రకాశ్‌కు చెందిన ఇల్లు దగ్ధమైంది. వివరాలు ఇలా ఉన్నాయి.. బుద్ద ప్రకాశ్ ఉపాధి నిమిత్తం దక్షిణాఫ్రికాలో మెల్ట్ కంపెనీలో అకౌంటెంట్‌గా పనిచేస్తూ కుటుంబానికి ఆసరాగా నిలుస్తున్నాడు. గతనెల క్రితం సమీప బంధువుల వివాహం నిమిత్తం గ్రామానికి వచ్చాడు. శనివారం పాలోది గ్రామంలో జాతరకు వెళ్లి వచ్చాడు. రాత్రి ఇంట్లో కుటుంబీకులు, అతను నిద్రకు ఉపక్రమించారు. రాత్రి ఒక్కసారిగా షార్ట్ సర్క్యూట్‌తో మంటలు వ్యాపించాయి. అప్రమత్తమైన కుటుంబీకులు, గ్రామస్తులు మంటలను అదుపుచేసే ప్రయత్నం చేసినా ఫలితం లేకుండా పోయింది. వస్తువులు టీవీ, బీరువాతోపాటు తదితర ఫర్నిచర్ వస్తువులు, రూ.1.22 లక్షల నగదు, సర్టిఫికెట్స్, పాస్‌పోర్ట్ కాలిపోయాయి. సుమారు రూ.5 లక్షల ఆస్తి నష్టం వాటిల్లిందని బాధితుడు తెలిపాడు. తాంసి ఎస్సై శివరాం ఆదివారం ఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు. తమను ఆదుకోవాలని బాధిత కుటుంబసభ్యులు కలెక్టర్‌ను వేడుకుంటున్నారు.


కాలిపోయిన ఇంటిని చూపుతున్న ప్రకాశ్

కొనసాగుతున్న 'కడెం' మరమ్మతులు


గేజ్ రూం సమీపంలో డ్రిల్లింగ్ పనులు


గుంత పూడ్చుతున్న పొక్లెయిన్

కడెం(ఖానాపూర్): కడెం ప్రాజెక్ట్ మరమ్మతు పనులు కొనసాగుతున్నాయి. భారీ వరదలకు దెబ్బతిన్న స్పిల్‌వే కింది ప్రాంతాన్ని సిమెంట్ కాంక్రీట్‌తో ఎడమ కాలువ వద్ద కోతకు గురైన ప్రాంతాన్ని మొరంతో పూడ్చారు. నూతన ప్రాజెక్ట్ నిర్మాణానికి సాధ్యాసాధ్యాలపై గతంలో ఢిల్లీ బృందం సూచించిన ప్రాంతాల్లో డ్రిల్లింగ్ పనులు కొనసాగుతున్నాయి. గత ప్రభుత్వంలో విడుదలైన రూ.కోటి నిధులతో మరమ్మతు పనులు కొనసాగుతున్నట్లు అధికారులు వెల్లడించారు.

నేడు సమీక్షా సమావేశం

కడెం ప్రాజెక్ట్ మరమ్మతులపై ఈఎన్‌సీ జనరల్ అనిల్‌కుమార్ సోమవారం హైదరాబాద్‌లో ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులు, మెకానికల్ టీం, ప్రాజెక్ట్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు. ఇందులో ప్రాజెక్ట్ స్థితిగతులపై పూర్తి రిపోర్ట్‌ను అందించనున్నట్లు డీఈ బోజదాసు తెలిపారు.

వైర్లనూ వదలడం లేదు..!

భైంసాటౌన్: పట్టణంలో చిల్లర చోరీలు ఎక్కువవుతున్నాయి. ఇటీవల గుజిరిగల్లి, బ్రాహ్మణగల్లిలో ఇళ్ల ముందు నిలిపిన ద్విచక్రవాహనాల టైర్లను ఎత్తుకెళ్లారు. తాజాగా పంటచేలల్లో బోరు మోటార్ల వైర్లు సైతం చోరీకి గురయ్యాయి. పట్టణంలోని పార్డి(బి) బైపాస్ రోడ్డులోని పంట చేలల్లో నుంచి రాత్రివేళల్లో వైర్లు ఎత్తుకెళ్లినట్లు బాధిత రైతులు పేర్కొంటున్నారు. ఇలా దాదాపు పది నుంచి పదిహే ను బోర్ల మోటారు వైర్లు చోరీకి గురైనట్లు తెలిపారు. గతంలో సైతం ఇలాంటి ఘటనలు జరిగినట్లు రైతులు చెబుతున్నారు.


భూమిలోపలి నుంచి బోరుకు ఉన్న వైరును ఎత్తుకెళ్లిన దృశ్యం